మంగళవారం
27-08-2024
# ముందడుగు
దినపత్రిక
సంపుటి: 1, సంచిక: 437 పేజీలు: 4 | ₹6
SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD
EPAPER.MUNDADUGU.COM

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచేయొచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..
Mundadugu whatsapp:
9491114616
email: mundadugu111@gmail.com




మీ వివాహానికి మమ్మల్నీ ఆహ్వానించండి

మిగతా 2లో



మహారాష్ట్రలో కుప్పకూలిన శివాజీ విగ్రహం

మిగతా 2లో



యుద్ధాన్ని ముగించడానికి సహాయం చేయండి

మిగతా 3లో



రాష్ట్రమంతా కృష్ణాష్టమి సందడి

మిగతా 5లో


## అత్యధికంగా సివిల్ సర్వెంట్లు రావాలి

### ఇంటర్వ్యూకి ఎంపికైనా రూ.1 లక్ష ఆర్థిక సాయం

రాష్ట్రంలో త్వరలో మరో 35 వేల ఉద్యోగాలు ▪ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ముందడుగు తెలంగాణ: తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం ఏర్పాటైన 90 రోజుల్లోనే 30 వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేశామన్నారు.

మరో 35 వేల ఉద్యోగాలు త్వరలో భర్తీ చేయబోతున్నట్లు చెప్పారు. యూపీఎస్సీ ప్రిలిమినరీ పరీక్షలో ఉత్తీర్ణులై.. మెయిన్స్ కోసం సన్నద్ధమవుతున్న తెలంగాణ అభ్యర్థులకు 'రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం' పేరిట రూ.1 లక్ష ఆర్థిక సాయం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులకు రేవంత్‌రెడ్డి చెక్కులు అందజేశారు. ప్రిలిమ్స్‌లో ఉత్తీర్ణత సాధించిన 135 మంది



అభ్యర్థులకు ఒక్కొక్కరికీ రూ.లక్ష చొప్పన అందజేశారు.

ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రం నుంచి అత్యధికంగా సివిల్ సర్వెంట్లు రావాలని ఆశిస్తున్నట్లు చెప్పారు. సివిల్స్ ఉత్తీర్ణులై రాష్ట్ర ప్రతిష్ఠను పెంచాలని ఆకాంక్షించారు. మెయిన్స్‌లో ఉత్తీర్ణత సాధించి.. ఇంటర్వ్యూకి ఎంపికైన వారికి కూడా రూ.1 లక్ష ఆర్థిక సాయం చేస్తామని ప్రకటించారు.

రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం పథకానికి ప్రభుత్వరంగ సంస్థ సింగరేణి కాలరీస్ నిధులు సమకూరుస్తోంది. ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, సింగరేణి సీఎండీ బలరాం తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రపాలిత ప్రాంతం లద్దాఖ్‌లో 5 కొత్త జిల్లాలు..

### అమిత్ షా కీలక ప్రకటన

### హర్షం వ్యక్తం చేసిన ప్రధాని మోడీ



ముందడుగు జాతీయం: భారతదేశంలోని కేంద్ర పాలిత ప్రాంతమైన లద్దాఖ్‌కు సంబంధించి కేంద్రం ఓ కీలక నిర్ణయం తీసుకుంది. అక్కడ కొత్తగా ఐదు జిల్లాలను ఏర్పాటుచేయనుంది. ఈమేరకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా సోమవారం సామాజిక మాధ్యమాల వేదికగా ప్రకటించారు.

"అభివృద్ధి చెందిన, సుసంపన్నమైన లద్దాఖ్‌ను నిర్మించాలనే ప్రధాని మోడీ సంకల్పంలో భాగంగా ఈ కేంద్ర పాలిత ప్రాంతంలో ఐదు కొత్త జిల్లాలను ఏర్పాటుచేయాలని కేంద్ర హోంమంత్రిత్వ శాఖ నిర్ణయించింది. కొత్తగా ఏర్పాటు చేయబోయే జన్‌స్కర్, ద్రాస్, షామ్, నుబ్రా, చాంగ్‌థాంగ్ జిల్లాలతో ప్రభుత్వ పాలన మరింత పటిష్టమవుతుంది. ప్రతీ ఇంటికి ప్రభుత్వ ఫలాలు అందుతాయి. లద్దాఖ్ ప్రజలకు అవకాశాలను సమృద్ధిగా అందించేందుకు మా ప్రభుత్వం సంసిద్ధంగా ఉంది" అని అమిత్ షా రాసుకొచ్చారు. తాజా నిర్ణయంపై ప్రధానమంత్రి నరేంద్రమోడీ స్పందించారు. "లద్దాఖ్ ప్రజల శ్రేయస్సు, మెరుగైన పాలనకు ఇదో ముందడుగు. కొత్త జిల్లాల ఏర్పాటుతో ప్రజలకు అవకాశాలు, సేవలు మరింత చేరువవుతాయి" అని మోదీ హర్షం వ్యక్తం చేశారు.

## సస్పెన్షన్లు ఉండవ్.. తీసేసుడే!



ముందడుగు తెలంగాణ: 'ఎంత మందలించిన కొందరు సిబ్బందిలో మార్పు రావడం లేదు. పంజాగుట్ట ఠాణా మాదిరిగా మధురానగర్, బోరబండ పోలీస్‌స్టేషన్లనూ ప్రక్షాళన చేస్తా' అని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆ రెండు ఠాణాల్లో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై సోమవారం 'ఖాకీ కాసుల కక్కుర్తి', 'వ్యభిచార గృహాలనూ వదలట్లే' అనే శీర్షికలతో 'నమస్తే తెలంగాణ'లో కథనాలు రావడంతో అవినీతి అధికారుల్లో అలజడి మొదలైంది. ఈ కథనాలపై విలేకర్లు సీపీని ప్రశ్నించడంతో ఆయన స్పందించారు. ఈ రెండు ఠాణాలు అలా ఎందుకు తయారవుతున్నాయో అర్థం కావడం లేదన్నారు. మధురానగర్ ఠాణాలో స్పాట్ సెంటర్ (వ్యభిచార గృహం) నుంచి కానిస్టేబుళ్లు మామూళ్లు తీసుకుంటున్న విషయం తమ దృష్టికి వచ్చిందని, దానిపై విచారణ కొనసాగుతున్నదన్నారు. ఇక నుంచి సస్పెన్షన్లు ఉండవని, ఉద్యోగం నుంచి తొలగించడమే ఉంటుందని సిబ్బందిని హెచ్చరించారు. బండ్లగూడ ఠాణాలో ఓ కానిస్టేబుల్ పాన్ డబ్బాలో నుంచి మామూళ్లు తీసుకుంటున్నట్లు ఫిర్యాదురావడంతో విచారణ జరిపి నిజమని తేలడంతో సస్పెండ్ చేశామని సీపీ వెల్లడించారు. అలాగే ఆ రెండు ఠాణాల్లో అవినీతి, అక్రమాలపై ఫిర్యాదులు ఉన్నాయని, తగిన చర్యలు తీసుకుంటానని, పంజాగుట్ట ఠాణా మాదిరిగానే వాటిని కూడా ప్రక్షాళన చేస్తామన్నారు. అవినీతి, అక్రమాలు చేసే వారిని సస్పెండ్ చేస్తే భయం ఉండటం లేదని, ఇక నుంచి ఉద్యోగం నుంచి తొలగించడమే ఉంటుందని, ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా పనిచేయాలని సీపీ సిబ్బందిని హెచ్చరించారు.

ముందడుగు
మంగళవారం, 27-08-2024, హైదరాబాద్

# మీ వివాహానికి మమ్మల్నీ ఆహ్వానించండి

- తప్పకుండా పిలుస్తానంటూ రాహుల్ గాంధీ హామీ
- కశ్మీరీ యువతులతో రాహుల్ సంభాషణ



ముందడుగు జాతీయం:
కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని వివాహం ఎప్పుడు చేసుకుంటారని కశ్మీరీ యువతులు అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ 20, 30 ఏళ్లుగా ఈ ఒత్తిడిని అధిగమించానని చెప్పారు. ఇటీవల జమ్మూ కశ్మీర్‌లో పర్యటించిన రాహుల్.. శ్రీనగర్‌కు చెందిన పలువురు విద్యార్థినులతో ముచ్చటించారు. ఈ సందర్భంలో పెళ్లి చేసుకోవడంపై కుటుంబ సభ్యుల నుంచి ఒత్తిడి వస్తోందా? అని రాహుల్ వారిని ప్రశ్నించారు. అదే సమయంలో మీ పెళ్లి ఎప్పుడు అంటూ రాహుల్‌నే ఎదురు ప్రశ్న వేశారు. దానికి నవ్వుతూ బదులిచ్చిన ఆయన.. '20-30 ఏళ్ల నుంచి ఈ ఒత్తిడిని అధిగమించా' అంటూ సమాధానమిచ్చారు.
వివాహం గురించి తదుపరి ప్రణాళికలు ఏంటని రాహుల్‌ని ప్రశ్నించగా.. ప్రస్తుతానికి అటువంటిదేమీ లేదన్నారు. కానీ,.. వాటిని తోసిపుచ్చలేమని చెప్పారు. దాంతో వివాహానికి మమ్మల్నీ ఆహ్వానించండి అంటూ అక్కడున్న విద్యార్థినులు కోరగా.. తప్పకుండా పిలుస్తానంటూ రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు. ఇందుకు సంబంధించిన వీడియోను తన 'ఎక్స్' ఖాతాలో పోస్టు చేశారు.

## మహిళ భద్రత గురించి
# మీరు మాట్లాడుతున్నారా..

- 123 ఫాస్ట్‌ట్రాక్ ప్రత్యేక కోర్టులను ప్రారంభించలే
- మహిళల భద్రతలో బెంగాల్ ప్రభుత్వం విఫలం
- దీదీపై మండిపడ్డ కేంద్ర మహిళా మంత్రి



ముందడుగు జాతీయం:
పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఇటీవల ప్రధాని నరేంద్ర మోడీకి మహిళ భద్రతకు సంబంధించి రాసిన లేఖపై కేంద్రం ఘాటుగా స్పందించింది. మమత ప్రభుత్వం మహిళల భద్రత విషయంలో వైఫల్యం చెందిందని కేంద్ర మహిళా, శిశుసంక్షేమశాఖ మంత్రి అన్నపూర్ణ దేవి మండిపడ్డారు. ఈ మేరకు సీఎం మమతా బెనర్జీకి సోమవారం ఆమె లేఖ రాశారు. కేంద్ర ప్రభుత్వం 123 ఫాస్ట్‌ట్రాక్ ప్రత్యేక కోర్టులను కేటాయించినప్పటికీ.. వీటిలో చాలా వరకు ప్రారంభించలేదని ఆక్షేపించారు.

"మహిళలు, బాలికలకు భద్రతా చర్యలు అమలు చేయడంలో బెంగాల్ ప్రభుత్వం విఫలమైంది. రాష్ట్రంలో 48,600 అత్యాచారం, పోక్సో కేసులు పెండింగ్‌లో ఉన్నప్పటికీ.. ఇంకా 11 ఫాస్ట్ ట్రాక్ ప్రత్యేక కోర్టులను ప్రారంభించేందుకు ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. ఉమెన్ హెల్ప్ లైన్, ఎమర్జెన్సీ రెస్పాన్స్ సపోర్ట్ సిస్టమ్, చైల్డ్ హెల్ప్‌లైన్‌లను సమర్థంగా అమలు చేయడంలో విఫలమయ్యారు. బాధిత మహిళలకు తక్షణ సాయం అందించడంలో ఈ సేవలు ఎంతో అవసరం. కేంద్ర ప్రభుత్వం పలుమార్లు గుర్తు చేస్తున్నా.. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం వీటిని ఇంకా ఏకీకృతం చేయలేదు. ఈ లోపం కారణంగా రాష్ట్రంలోని మహిళలు, చిన్నారులు ఆపద సమయంలో అవసరమైన సహాయాన్ని కోల్పోతున్నారు" అని మండిపడ్డారు.

# మహారాష్ట్రలో కుప్పకూలిన శివాజీ విగ్రహం

- వర్షా ల కారణంగానే 35 అడుగుల విగ్రహం నేలమట్టం
- నాణ్యతా లోపం కారణమంటూ ప్రతిపక్షాల ఆరోపణ

ముందడుగు మహారాష్ట్ర:
మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ మహరాజ్ 35 అడుగుల విగ్రహం మహారాష్ట్రలో కుప్పకూలింది. రెండు రోజులుగా రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షా ల కారణంగానే విగ్రహం కూలినట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై ప్రతిపక్షాలు రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నాయి. సింధుదుర్గ్ జిల్లాలోని రాజ్‌కోట్ కోటలో 35 అడుగుల శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. నేవీ డే సందర్భంగా గతేడాది ప్రధాని నరేంద్ర మోడీ విగ్రహ ఆవిష్కరణ చేశారు. రాష్ట్రంలో గత రెండు, మూడు రోజులుగా భారీ వర్షా లు కురుస్తున్నాయి. ఈదురు గాలులు వీస్తున్నాయి. ఈ క్రమంలోనే భారీ విగ్రహం కుప్పకూలింది. ఘటనా స్థలానికి పోలీసు సిబ్బంది, జిల్లా అధికారులు చేరుకున్నారు. ఈ ఘటనకు సరైన కారణాలు తెలుసుకునేందుకు నిపుణుల బృందం రంగంలోకి దిగింది.



### నాణ్యతపై దృష్టి పెట్టలేదు..

శివాజీ విగ్రహం కూలిపోవడంతో రాష్ట్ర ప్రభుత్వంపై ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. నాణ్యతా లోపం కారణంగా విగ్రహం కూలిపోయిందంటూ ఆరోపించాయి. "రాష్ట్ర ప్రభుత్వం విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంపై తప్ప.. నాణ్యతపై దృష్టి పెట్టలేదు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఈ నష్టం జరిగింది. ప్రధాని మోదీ ఈ కార్యక్రమానికి వచ్చి విగ్రహ ఆవిష్కరణ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్త టెండర్లు వేసి.. దాని ప్రకారం కమీషన్లు ఇస్తోంది" అని ఎన్సీపీ (ఎస్పీ) రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ మంత్రి జయంత్ పాటిల్ ఆరోపించారు.

# ఫోన్‌పేలో యూపీఐపై క్రెడిట్ లైన్ సౌకర్యం

PhonePe


ముందడుగు హైదరాబాద్:
ఫోన్‌పే కస్టమర్ల సౌలభ్యం కోసం మరో అడుగు ముందుకేసింది. తమ ప్లాట్‌ఫామ్‌లో యూపీఐ పేమెంట్లకు క్రెడిట్ లైన్‌ను ఎనేబుల్ చేసుకునే అవకాశాన్ని అందుబాటులోకి తెచ్చామని ఈ రోజు ప్రకటించింది. తమ బ్యాంక్‌ల నుండి క్రెడిట్ లైన్లు పొందే యూజర్లు ఇకపై వీటిని ఫోన్‌పేలో యూపీఐకి లింక్ చేయవచ్చు. దీంతో మర్చంట్లకు ఎప్పటికప్పుడు సజావుగా పేమెంట్లు చేసేందుకు వీలవుతుంది. ఈ ఫీచర్ లాంచ్ గురించి ఫోన్‌పే పేమెంట్స్ హెడ్ దీప్ అగర్వాల్ మాట్లాడుతూ "మా ప్లాట్‌ఫామ్‌లో యూపీఐకి క్రెడిట్ లైన్‌ను ఎనేబుల్ చేస్తున్నందుకు మాకు సంతోషంగా ఉంది.

ఇటీవల మేము తీసుకొచ్చిన 'యూపిఐతో రూపాయ్ క్రెడిట్ కార్డ్‌ల అనుసంధానం' అద్భుతమైన విజయం సాధించిన సంగతి తెలిసిందే, అదే వరుసలో యూపీఐలో క్రెడిట్ వినియోగ సామర్థ్యాన్ని అన్‌లాక్ చేసే రెండవ ఫీచర్ ఇది. భారతదేశంలో డిజిటల్ పేమెంట్లు అద్భుతమైన పురోగతి సాధిస్తున్నాయని మేము నమ్ముతున్నామన చెప్పారు.

ముందడుగు
మంగళవారం, 27-08-2024, హైదరాబాద్

# యుద్ధాన్ని ముగించడానికి సహాయం చేయండి

- ఉక్రెయిన్‌పై 100కు పైగా క్షిపణులతో దాడి
- పౌర మౌలిక సదుపాయాలను లక్ష్యం
- రష్యా, ఉక్రెయిన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు



ముందడుగు డెస్క్:
రష్యా, ఉక్రెయిన్ మధ్య మళ్లీ భీకరపోరు మొదలయింది. సోమవారం ఉదయం నుంచి మాస్కో దళాలు భారీ ఎత్తున క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడుతోంది. రాజధాని కీవ్ సహా ఉక్రెయిన్ వ్యాప్తంగా భీకర పేలుళ్లు సంభవించాయి. ఈ మేరకు అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఓ వీడియో సందేశంలో వెల్లడించారు. ఈ దాడుల్లో ప్రాణనష్టం కూడా సంభవించినట్లు ఆవేదన వ్యక్తం చేశారు.

"ఈ ఉదయం నుంచి దాదాపు 100కు పైగా క్షిపణులు, దాదాపు 100 డ్రోన్లతో రష్యా దాడి చేస్తోంది. కీలకమైన పౌర మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుని విరుచుకుపడుతోంది. ఖర్కీవ్ నుంచి కీవ్ వరకు ఒడెస్సా నుంచి పశ్చిమ ప్రాంతాల వరకు ప్రతి ప్రదేశంలో పేలుళ్లు చోటుచేసుకున్నాయి. ప్రాణ నష్టం కూడా జరిగింది. విద్యుత్ ప్లాంట్లపై దాడులు చేయడంతో చాలా చోట్ల కరెంట్ సరఫరా నిలిచిపోయింది. మా బలగాలు అవసరమైన చర్యలు చేపట్టాయి" అని జెలెన్‌స్కీ ఆ వీడియోలో తెలిపారు. ఈ సందర్భంగా రష్యాపై ఆయన తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఉత్తరకొరియా నుంచి బాలిస్టిక్ క్షిపణులతో పాటు అనేక ఆయుధాలను మాస్కో ప్రయోగిస్తోందని దుయ్యబట్టారు. ఈ యుద్ధాన్ని ముగించడానికి బలమైన పరిష్కారాలు కావాలని అన్నారు. అమెరికా, యూకే, ఫ్రాన్స్ సహా ఇతర మిత్రపక్షాలు తమకు సాయం చేయాలని అభ్యర్థించారు.



# వాహనాల నుంచి ప్రయాణీకులను దింపి కాల్చేశారు

- 23 మంది ప్రాణాలు తీసిన సాయుధులు
- పాకిస్థాన్‌లో దారుణ సంఘటన

ముందడుగు పాకిస్తాన్:
పాకిస్థాన్‌లో కొందరు సాయుధులు రహదారిని అడ్డగించి, వాహనాల నుంచి ప్రయాణికుల్ని కిందికి దింపేసి కాల్పులు జరిపారు. బలూచిస్థాన్‌లోని ముసాఖెల్ జిల్లాలో సోమవారం జరిగిన ఘటనలో 23 మంది ప్రాణాలు కోల్పోయారని డాన్ మీడియా సంస్థ వెల్లడించింది. బలూచిస్థాన్‌లోని ఖలాత్ జిల్లాలో జరిగిన మరో కాల్పుల ఘటనలో 10 మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో నలుగురు పోలీసులు అధికారులు ఉన్నారు.

ముసాఖెల్ జిల్లాలోని రరాషమ్‌లోని రహదారిపై ఈ ఘటన చోటుచేసుకుంది. కొందరు సాయుధులు దారిని అడ్డగించి, అటుగా వస్తోన్న బస్సులు, ట్రక్కుల్లో నుంచి ప్రయాణికుల్ని దింపి, వారి గుర్తింపు తనిఖీ చేశారు. తర్వాత వారిపై కాల్పులు జరపడంతో 23 మంది మృతి చెందారు. అంతేగాకుండా వాహనాలకు నిప్పుపెట్టారు. పాక్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌కు చెందిన ప్రయాణికులే లక్ష్యంగా ఈ దాడి జరిగినట్లు మీడియా పేర్కొంది. పోలీసు ఉన్నతాధికారులు కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించారు. బలూచిస్థాన్ ముఖ్యమంత్రి సర్ఫరాజ్ బుగ్టీ ఈ దాడిని తీవ్రంగా ఖండించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## రన్ ఆఫ్ కచ్ లో తన నైపుణ్యం నిరూపించిన ద ఇంటెలిజెంట్ సియూవీ ఎంజి విండ్సర్



ముందడుగు హైదరాబాద్:
జేస్ డబ్ల్యూ ఎంజి మోటార్ భారతదేశంలో రాబోతున్న వాహనం- ఎంజి విండ్సర్, భారతదేశపు మొదటి క్రాస్ ఓవర్ యుటిలిటి వెహికిల్ గుజరాత్ లోని  సమస్యాత్మకమైన భూభాగం రన్ ఆఫ్ కచ్ లో తన సాటిలేని సామర్థ్యాన్ని ప్రదర్శించింది. భారతదేశపు మొదటి సియువి-ఎంజి విండ్సర్ తన నైపుణ్యాన్ని నిరూపించింది మరియు ప్రపంచంలోనే అతి పెద్ద ఉప్పు ఎడారులలో ఒకటైన రన్ ఆఫ్ కచ్ లోని 44oCకి పైగా తీవ్రమైన వేడిలో తన ఇంజనీరింగ్ శ్రేష్టతను వెల్లడించింది. ఈ వీడియో శ్రేణిలోనే మొదటి 'ఏరో-లాంజ సీట్స్ 'మరియు 'ఇన్ఫినిటి వ్యూ గ్లాస్ రూఫ్' ను ఇటీవల వెల్లడించిన వీడియోని అనుసరించి వచ్చింది. ఇది ఇప్పటికే శ్రేణిలో సౌకర్యం మరియు ప్రీమియత్వానికి కొత్త ప్రమాణంగా నిలిచింది. ఈ ఆధునిక ఫీచర్స్ యొక్క ఈ కలయిక ఆచరణీయత మరియు పనితీరులో రాజీ లేని ప్రీమియం డ్రైవింగ్ అనుభవాన్ని కోరుకునే భారతదేశపు వినియోగదారులకు ప్రధానమైన ఎంపికగా ఎంజి విండ్సర్ ను మార్చింది.

# కేజీ జిలేబీ తెస్తేనే కేసు నమోదు చేస్తాం

## ఫిర్యాదుదారుడికి పోలీసుల ఆదేశాలు



ముందడుగు ఉత్తరప్రదేశ్:
విలువైన వస్తువు కనపడకపోతే ఎవరైనా వెతకడం సహజం. అప్పటికీ దొరక్కపోతే పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేస్తాం. యూపీలోని కనౌర్ గ్రామానికి చెందిన చంచల్ కుమార్ అనే యువకుడు అదే చేశాడు. గత శనివారం మందులు కొనుగోలు చేయడానికి మెడికల్ షాప్‌కు వెళ్లాడు. బిల్లు ఫోన్‌పే చేయడానికి మొబైల్ కోసం జేబులో చెయ్యి పెట్టాడు. అయితే ఫోన్ కనబడలేదు. దారిలో పడిపోయిందేమోనని వచ్చిన దారిలో వెతుక్కుంటూ ఇంటికి చేరాడు. ఇంట్లో వెతికినా ఫోన్ దొరకలేదు. వెంటనే పోలీస్ స్టేషన్‌కు వెళ్లి కంప్లైంట్ చేశాడు. ఎలాగైనా ఫోన్‌ను కనిపెట్టాలని పోలీసులను కోరాడు.

### కిలో స్వీట్స్ తెస్తేనే కేసు నమోదు

స్టేషన్‌లో పోలీసుల ప్రవర్తన చూసి చంచల్ కుమార్ షాక్ అయ్యాడు. ఫిర్యాదును పరిష్కరించాల్సిన పోలీసుల చిల్లర ప్రవర్తన అతనికి చికాకు తెప్పించింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేయాలంటే కేజీ జిలేబీ తీసుకురావాలని డిమాండ్ చేశారు. కొద్దిసేపు ఆలోచించి, తనకు ఫోన్ దొరకడం ముఖ్యమని అనుకుని పోలీసులు చెప్పినట్లు కేజీ జిలేబీ తీసుకొచ్చాడు. తర్వాత ఈ విషయం బయటకు రావడంతో అధికారులు ఫైర్ అవుతున్నారు. ఫిర్యాదు రిజిస్టర్ చేయకుండా, బాధితునితో జిలేబీ తెప్పించుకున్న పోలీసులపై చర్యలు తీసుకోవాలని నెటిజన్లు డిమాండ్ చేస్తున్నారు.

ముందడుగు
మంగళవారం, 27-08-2024, హైదరాబాద్

## నెట్‌వర్క్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను మెరుగుపర్చడంపై వీ దృష్టి




ముందడుగు హైదరాబాద్:
దిగ్గజ టెలికం కంపెనీ అయిన వీ తెలంగాణలోని తమ నెట్‌వర్క్ సామర్థ్యాన్ని అప్‌గ్రేడ్ చేసినట్లు వెల్లడించింది. రాష్ట్రంలోని 4,000 పైచిలుకు సైట్లలో LTE 2500 MHz బ్యాండ్‌లో స్పెక్ట్రంను 10 MHz నుంచి 20 MHzకి అప్‌గ్రేడ్ చేసింది. తద్వారా ఈ లేయర్‌లో నెట్‌వర్క్ సామర్థ్యాన్ని రెట్టింపునకు పెంచుకుంది.
హైదరాబాద్, వరంగల్, నిజామాబాద్, కరీంనగర్, రామగుండం, ఖమ్మం, మహబూబ్‌నగర్, నల్గొండ, అదిలాబాద్, సూర్యాపేట, మిర్యాలగూడా, కామారెడ్డి, సంగారెడ్డి, రంగారెడ్డి తదితర నగరాలు ఈ జాబితాలో ఉన్నాయి.
"నెట్‌వర్క్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను అప్‌గ్రేడ్ చేయడం, తమ యూజర్లకు మెరుగైన వేగం మరియు విశ్వసనీయతను అందించాలన్న వీ విస్తృత వ్యూహానికి అనుగుణంగా ఈ స్పెక్ట్రం అప్‌గ్రేడ్ చేపట్టబడింది. ఇటీవల 900 MHz బ్యాండులో కొనుగోలు చేసిన 2.4 MHzను కూడా వినియోగంలోకి తేవడం ద్వారా రాబోయే రోజుల్లో మా నెట్‌వర్క్‌ను మరింత పటిష్టం చేసుకోవడాన్ని కొనసాగిస్తాం" అని వొడాఫోన్ ఐడియా క్లస్టర్ బిజినెస్ హెడ్ (ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ, కర్ణాటక) ఆనంద్ డానీ తెలిపారు. డిజిటల్ ప్రపంచంలో తమ కస్టమర్లు ముందుకెళ్లేలా వారి కోసం వీ సరికొత్త ఆఫర్లు, ప్లాన్లను కూడా ప్రవేశపెట్టింది.

# 80 ఏళ్లుగా ఉంటున్న ఇల్లు కూల్చివేత

## కోర్టు ఉత్తర్వులు ఉన్నా లెక్క చేయలేదని ఆవేదన

### అక్రమం కాదని తీర్పు వస్తే న్యాయం ఎవరు చేస్తారని ప్రశ్న

ముందడుగు హైదరాబాద్:
హైడ్రా పేరు వింటేనే ఇప్పుడు హైదరాబాద్ వణికిపోతుంది. అక్రమ కట్టడాలపై కొరడా ఝులిపిస్తోంది. సోమవారం (ఆగస్టు 26) రాయదుర్గంలో ఓ వ్యక్తి ఇంటిని కూల్చివేయడం చర్చనీయాంశంగా మారింది. అది తమ తాతల కాలం నాటి ఆస్తి అని, 80 ఏళ్లుగా తాను ఆ ఇంట్లో ఉంటున్నానని బాధితుడు చెబుతున్నాడు. చిన్నపిల్లలను, ఆడవాళ్లను బయటకి పంపించి.. సామాన్లన్నింటిని బయటపడేసి ఎలాంటి ముందస్తు హెచ్చరికలు లేకుండా బుల్డోజర్లతో తన ఇంటిని నేలమట్టం చేశారని ఆవేదన వ్యక్తం చేశాడు.

హైకోర్టులో తాము వేసిన రిట్ పిటిషన్ విచారణ పెండింగ్‌లో ఉందని.. కోర్టు ఉత్తర్వులు ఉన్నా లెక్కచేయకుండా ఇంటిని కూల్చివేశారని బాధితుడు చెబుతున్నాడు. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం పరిధిలోని ఆ స్థలంలో తన ముత్తాత 1943లో ఒక ఫ్యాక్టరీని నిర్వహించాడని ఆయన తెలిపాడు. 'రేవంత్ రెడ్డి గారిని చేతులు జోడించి వేడుకుంటున్నా.. ఇలాంటి కూల్చివేతలు ఆపించండి' అని బాధితుడు కోరుతున్నాడు.



ఈ ఘటనతో.. చెరువులు, ప్రభుత్వ స్థలాల సమీపంలో ఇళ్లు నిర్మించుకొని, 40 - 60 ఏళ్లుగా నివాసం ఉంటున్న వారిలో వణుకు పుడుతోంది. ఒక్క హైదరాబాద్ నగరం మాత్రమే కాదు. రాష్ట్రంలో ఉన్న అన్ని నగరాలు, పట్టణాల్లో 70-80 శాతం విస్తీర్ణం ఒకప్పుడు అడవులు, చెరువులకు సంబంధించిన భూమేనని అందరికీ తెలుసు. వాటన్నింటినీ కూల్చివేస్తారా? ఈ పరిమితులను ఎవరు? ఎప్పుడు? నిర్ణయిస్తారు' అని ఓ జర్నలిస్టు ట్వీట్ చేశారు.
రేపు ఒకవేళ ఆ నిర్మాణం అక్రమం కాదని తీర్పు వస్తే.. ఆ కుటుంబానికి ఎలా న్యాయం చేస్తారు?
హైకోర్టు కంటేనూ హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఎసెట్స్ మానిటరింగ్ ప్రొటెక్షన్ ఏజెన్సీ) ఉన్నతమైందా? హైడ్రా ఎన్నేళ్ల వరకు ఉంటుంది? ఇంకో 50 ఏళ్లు, 100 ఏళ్ల ఇదే విధానాన్ని అమలు చేస్తారా? 80 ఏళ్ల కిందట నిర్మించిన ఇంట్లో ప్రస్తుతం నివాసం ఉంటున్న వారి వారసులు ఏం పాపం చేశారు?' అంటూ నెటిజన్లు పలు ప్రశ్నలు సంధిస్తున్నారు.

# IELTS 19ని ప్రారంభించిన కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ

ముందడుగు హైదరాబాద్:
IELTS పరీక్షకు సహ భాగస్వాములుగా కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ ప్రెస్ అండ్ అసెస్‌మెంట్ అధికారిక కేంబ్రిడ్జ్ పరీక్షల తయారీ రిసోర్సు 'IELTS 19'ని ప్రారంభించింది. న్యూ ఢిల్లీలోని కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ ప్రెస్ & అసెస్‌మెంట్, కంబైన్డ్ ఇంగ్లీష్- సౌత్ ఏషియా హెడ్ టీకే అరుణాచలం నేతృత్వంలో నిర్వహించిన కార్యక్రమంలో దీన్ని ప్రారంభించారు. ప్రపంచవ్యాప్తంగా ఆంగ్ల భాషా ప్రావీణ్యాన్ని గుర్తించే మొదటి అంచనాగా, IELTS విద్యా సంస్థలు, యజమానులు మరియు ఇమ్మిగ్రేషన్ అధికారులచే భాషాపరమైన సామర్థ్యానికి ప్రమాణంగా గుర్తించబడింది. కేంబ్రిడ్జ్ యూనివర్శిటీ ప్రెస్ & అసెస్‌మెంట్ కంబైన్డ్ ఇంగ్లీష్ - సౌత్ ఏషియా హెడ్ అరుణాచలం టీకే మాట్లాడుతూ, "దక్షిణాసియాలోని అభ్యాసకులకు IELTS 19ని సగర్వంగా అందిస్తున్నాము. ఇది వాస్తవ పరీక్ష నమూనాలో ప్రామాణికమైన పరీక్షా పత్రాలను కలిగి ఉంది. అభ్యాసకులు అధిక బ్యాండ్ స్కోర్‌లను సాధించేందుకు సహకరిస్తుంది అన్నారు.



ముందడుగు
మంగళవారం,
27-08-2024,
హైదరాబాద్



# వేదవ్యాస పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలు

ముందడుగు వెంకటాపూర్: వెంకటాపూర్ మండల కేంద్రంలోని స్థానిక వేదవ్యాస ఉన్నత పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థిని విద్యార్థులు గోపిక శ్రీకృష్ణుని వేషధారణ వేసి అందరినీ మంత్రముగ్ధులను చేసినారు స్థానిక రామాలయంలో ఉట్టి కొట్టు కార్యక్రమంలో పాల్గొన్నారు. విజేతలకు ఆలయ అర్చకులు మరియు చైర్మన్ నరెడ్ల భాస్కర్ బహుమతులు అందజేశారు. అదేవిధంగా పాఠశాల ఆవరణలో విద్యార్థులు ఆట పాటలతో పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానాచార్యులు పోషాల వీరమల్లు దశావతారాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు

# శ్రీశైల దేవస్థానంలో శాస్త్రోక్తంగా గోపూజ



ముందడుగు శ్రీశైలం: కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైలం దేవస్థానంలో సోమవారం ఉదయం ఆలయ ప్రాంగణంలోని శ్రీగోకులంలో గోపూజను నిర్వహించారు. ప్రతినిత్యం ఆలయంలో ప్రాతఃకాల సమయంలో నిత్యసేవగా గోపూజ నిర్వహించబడుతున్నప్పటికీ, కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని నిత్యసేవతో పాటు విశేషంగా గోపూజ జరిపించబడింది. శాస్త్రోక్తంగా జరుపబడిన ఈ గోపూజలో ముందుగా ఆలయప్రాంగణంలోని శ్రీ గోకులములో గోవులకు, గోవత్సాలకు (ఆవుదూడలకు) పూజాదికాలు జరిపించబడ్డాయి. ఈ విశేష కార్యక్రమాన్ని ముందుగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు, వేదపండితులు పూజాసంకల్పాన్ని పఠించారు..ఈ కార్యక్రమములో కార్యనిర్వహణాధికారి డి. పెద్దిరాజు దంపతులు, సహాయ కార్యనిర్వహణాధికారి ఐ.ఎన్.వి. మోహన్, పర్యవేక్షకులు డి. స్వర్ణలత, అర్చకులు, వేదపండితులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# రాష్ట్రమంతా కృష్ణాష్టమి సందడి



ముందడుగు తెలంగాణ: అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకునే పండగలలో శ్రీకృష్ణ జన్మాష్టమి ఒకటి. అలాంటి కృష్ణాష్టమిని తెలుగు రాష్ట్రాలలోని పలు పాఠశాలల్లో ఘనంగా జరుపుకున్నారు. బాల బాలికలు శ్రీ కృష్ణుడు, గోపికల వేషధారణతో  సందడి చేశారు. హైదరాబాద్ లోని పలు పాఠశాలల్లో కూడా కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. చిన్నారులు ఉట్టి కొట్టి సందడి చేశారు.

